# నూరు శరత్తులు బ్రతకాలి



హితశ్రీ

రామారావు ఏకాకి. ఆ ఉదయమే ఇల్లు మారి సామానంతా ఒంటరిగా సర్దుకుని అలసిపోయి, స్నానంచేసి హోటల్‌కి వెళ్ళి భోజనంచేసి వచ్చి మంచంమీద మేనువాల్చాడు. ఇల్లు వసతిగానే ఉందనుకొన్నాడు. అది మూడు భాగాల ఇల్లు. ఒక చివర భాగం రామారావుకి ఇచ్చారు. రెండో చివర ఇంకెవరో ఉంటున్నారు. వాళ్ళెవరో రామారావుకి తెలియదు. మధ్యభాగంలో ఇంటి యజమాని ఉంటాడు. ఆయన రిటైర్డు తాసిల్దారు. రామారావుకి ఆయన మంచివాడుగానే కనిపించాడు. సరసంగా మాట్లాడాడు. తనకి కుటుంబం లేదని చెప్పినా ఏమీ అభ్యంతరం చెప్పలేదు. ఏ షరతులూ విధించలేదు. అడ్వాన్సు కూడా అడగలేదు. పెద్ద మనిషే.

రామారావు ఆలోచనలని ఆటంకపరుస్తూ మధ్య భాగంలోని గోడ గడియారం గంటలు కొట్టసాగింది. ఆ గంటలు అతనికి శ్రావ్యంగా ఉన్నాయి. ప్రతి గంటకీ ఒక ప్రతిధ్వని. లయ తప్పకుండా వినిపించే ఆ గంటలు అతను లెక్కపెట్టాడు, పదకొండు. అతను రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు. పన్నెండు. అది రేడియో టైం. గోడ గడియారం వెనకబడిపోయింది. లేదా, అది సరిగానే టైంచూపిస్తున్నా, గంటలు వెనకబడిపోయాయి. అంతే మరి. జీవితం లయ తప్పకుండా గడిస్తే చాలదు, అది అర్థవంతం కూడా కావాలి. తన జీవితానికి అర్థం ఏమిటి!

"ఇల్లు వసతిగా ఉందా బాబూ?" రిటైర్డ్ తాసిల్దారు నరసింహంగారు కిటికీలోంచి చూస్తూ అడిగాడు.

"ఆ. ఆ. వసతిగానే ఉందండీ. థాంక్స్" అన్నాడు రామారావు.

"ఏమైనా కావలిస్తే అడగండి. ఆదివారం, అంగళ్ళుకూడా ఉండవు."

"అలాగే"

ఆయన వెళ్ళిపోయాడు. రామారావు ఇల్లు పరికించి చూసాడు. వసతిగానే ఉంది. ఇల్లులాగే జీవితమూ! వసతిగా ఉండగానే సరిపోతుందా! ఎవరెవరు

వస్తారు, ఉంటారు, వెళతారు! రామారావు ఉస్సురన్నాడు. అతని మనసులో ఆలోచనలు ముసురుకొన్నాయి. ఇంతలో అతనికి కునుకుపట్టింది. మళ్ళీ అతనికి మెలకువవచ్చేసరికి మధ్యభాగం లోంచి స్వరయుక్తంగా వినిపించ సాగింది.

"తచ్చక్షుర్దేవహితం పురస్తాచ్ఛుక్ర ముచ్చరత్ పశ్యేమ శరదశ్శతం జీవేమ శరద శ్శతం...."

రామారావు పెదవులమీద చిరునవ్వు విరిసింది. ఈయన మధ్యాహ్నిక సంధ్యావందనం కూడా చేస్తాడన్నమాట. అవునులే. పనేముంది? ఉన్న ఇద్దరు కొడుకులు అమెరికాలో ఇంజనీర్లుగా ఉన్నారు. ఆడపిల్లలేరు. బాదరబందీ ఏమీలేదు. రిటైరయ్యాడు. ఇల్లూ, పొలమూ ఉన్నాయి. తనూ, భార్యా! ఏంతోస్తుంది మరి! త్రికాల సంధ్యావందనమూ చెయ్యొచ్చు, చెక్కభజన్లూ చెయ్యొచ్చు, తరంగాలు పాడనూవచ్చు — సంగీతమంటూ వస్తే!

"....నన్దామ శరద శ్శతం మోదామ శరదశ్శతం భవామ శరద శతం శృణవామ శరద శ్శతం.

ఆ స్వరం వినటానికి ఇంపుగా ఉంది. ఆ వాక్యాలు అతనికి కొత్తవేమీకావు. చిన్నప్పుడు నేర్చుకొని వదిలేసినవే. తూర్పున ఉదయించే, సర్వప్రపంచానికి కన్నులవంటి, దేవతలకు హితమైనటువంటి సూర్యతేజాన్ని నూరు సంవత్సరాలు (శరత్తులు అనటంలో అందం ఉంది.), చూడాలి, నూరు సంవత్సరాలు బ్రతకాలి, ఆనందించాలి, సంతృప్తి చెందాలి, అభివృద్ధి చెందాలి, వినదగింది వినాలి, చెడు నిరసించాలి, అజేయులం కావాలి. మంచిదే! రామారావుకి ఈ అర్థం పట్టలేదు. ఆ స్వరం అతనిలో ఏదో ప్రకంపనం, ఏదో స్పందన కలిగిస్తోంది. అలా వింటూ తనని తాను మర్చిపోయాడు. స్వరం ఆగిపోగానే మళ్ళీ ఈ ప్రపంచంలో పడ్డాడు. అతనికి అకస్మాత్తుగా ఓ ఆలోచన కలిగింది. ఎంతసేపటికీ బ్రతకాలి, చూడాలి, వినాలి, సంతోషపడాలి అనేగాని మిగతా విషయాలజోలికి పోలేదేం? సుష్ఠుగా భోంచెయ్యాలి, ఘాటైనవి వాసనచూడాలి హాయైన శరీరసౌఖ్యం పొందాలి అనలేదేం? పంచేంద్రియాల్లో కళ్ళూ, చెవులూ తప్ప మిగతా ఇంద్రియాలు ఇంద్రియాలు కావా, వాటి గోడవేం పట్టించుకోనక్కర్లేదా?

రామారావుకు నవ్వొచ్చింది. ఆ వెంటనే విషాదమూ కలిగింది. అసలీ ప్రపంచంలో ఏముంది చూడటానికీ, వినటానికీ? భ్రమ! అందం అందం కాదు. మాధుర్యం మాధుర్యం కాదు. వసంత అందాన్నే చూస్తూ, ఆమె మధుర వచనాన్నే వింటూ జీవితం గడపాలనుకున్నాడు. ఆమెతో విహరించాడు. పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఇదంతా నాటకం అన్నట్లుగా ఆమె ఎవరినో ఇంజనీర్ని పెళ్ళిచేసుకొని అతనితో అమెరికాకి నిష్క్రమించింది. తన జీవితంలో వెలుగు అంతరించింది.

అదతో తత్త్వ జిజ్ఞాసా - ఏది వెలుగు, ఏది చీకటి? ఏది నిజం? ఏది అబద్ధం? ఏది నిత్యం, ఏది అనిత్యం? ఏది అందం, ఏది కాదు? ఏది విలువ, ఏది కాదు? ఏది మంచి, ఏది చెడు? రామారావు ప్రాచ్య పాశ్చాత్య తత్త్వశాస్త్రగ్రంధాలు తిరిగేశాడు. ఇంకా అనేక పుస్తకాలు చదివాడు. అంతా అనిశ్చితమే. అతనికి జీవితంలో కోరదగిందేమీ కనిపించలేదు. అసలీ జీవితం ఎందుకో అతనికి అర్థం కాలేదు. బాంక్ ఆఫీసరైనా, ఆ హోదా అతనికేం సంతృప్తి నివ్వలేదు. తను చేస్తున్న పనిలో అభిరుచి లేదు. ఎంతసేపటికీ డిపాజిట్లు, డ్రాఫ్టులు, అప్పులు, తాకట్లు, వసూళ్ళు సంతకాలు యాంత్రిక జీవితం. ఏ పనిచేసినా నిర్లిప్తంగానే చేస్తున్నాడు. అలవాట్లలో నిర్లక్ష్యం చోటుచేసుకొంది. భోజనం తప్పక చెయ్యాలనే నియమం లేదు. ఏదో తింటాడు. విసుగ్గా ఉంటే ఏ సినిమాకో వెళతాడు. అదేమీ ఆసక్తి కలిగించదు. మధ్యలోనే వచ్చేస్తాడు. ఎంతమందిలో ఉన్నా ఒంటరితనం గుర్తువస్తూ ఉంటుంది. ఎందులోనూ లీనంకాలేక పోతున్నాడు. ఉబుసుపోకకి ఈ మధ్య సాయంకాలాలు క్లబ్బులో పేకాట ఆడటం అలవాటుచేసుకొన్నాడు. అందులోనూ ఉత్సాహం లేదు.

"ఎందుకీ జీవితం?" అని ప్రశ్న వేసుకొని 'పుట్టినందుకు' అని జవాబు చెప్పుకొని సమాధానపడిన రామారావు చాలాకాలం తర్వాత ఆ మధ్యాహ్నం మళ్ళీ తనలో ఏదో స్పందన కలగటం గుర్తించాడు. ఏమిటీ స్పందన? ఆలోచిస్తూండగానే అతనికి మళ్ళీ కునుకు పట్టింది

"తాంగు తక్కై తళాంగు తకిట తధిగిణతోం...."

ఉలిక్కిపడి లేచాడు రామారావు. వాచ్ చూసుకొన్నాడు నాలుగవుతోంది. అంతసేపు నిద్రపోయాడా తను!

"తాంగు తక్కై తళాంగు తకిట తధిగిణతోం" ముక్తాయింపూ, నట్టువ స్వరమూ, గజ్జెలరవళీ చేరువగా వినిపిస్తున్నాయి. ఎవరో నృత్యం చేస్తున్నారు దగ్గర్లో. రానురాను తన హృదయంలోనే ఆ మధుర ధ్వనులు వినిపిస్తున్నట్టు ఒక వింత అనుభూతి కలిగిందతనికి. ఒక్క క్షణం పరవశించాడు. అప్రయత్నంగా గదిలోంచి వరండాలోకి వచ్చాడు. మూడు భాగాలకీ అదే వరండా. మధ్య గోడలు లేవు. నృత్యం ఆ చివరి భాగంలో జరుగుతున్నదని గ్రహించాడు రామారావు.

"రండి, రండి" అన్నాడు అక్కడే

కూర్చున్న నరసింహం.

"ఎవరండీ నృత్యం చేస్తున్నట్టున్నారు?" కూర్చుంటూ అడిగాడు రామారావు.

"ఆఁ— ఈ చివరిభాగంలో ఉంటున్నారే, వెంకటేశ్వర్లుగారనీ— వారి అమ్మాయి ఉదయ. చాలా చురుకైన పిల్ల. అయితే చదువులో అంత ధ్యాస లేదు. అందువల్ల ఇంటర్ కాగానే చదువు మాన్పించి నృత్యమూ, సంగీతమూ నేర్పిస్తున్నారు అమ్మాయికి."

"అలాగా! వెంకటేశ్వర్లుగారేం చేస్తుంటారు?"

"స్టేషన్‌మాస్టర్ చేసి ఈ మధ్యనే రిటైరయ్యారు. నన్నడిగితే ఆ అమ్మాయికి చదువుమీద శ్రద్ధలేకపోవటమూ కాదు, ఏమీ కాదు. రైళ్ళమోత వినివిని వినుగెత్తి, జనం ప్లాట్‌ఫారాల మీద పరిగెత్తటం చూసి చూసి చిరాకుపడి, కాస్త స్వరయుక్తంగా గొంతు సారించాలనీ, కొంచెం అందంగా చిందులు తొక్కాలనీ ఆ పిల్లకి అనిపించి ఉంటుంది. ఏమంటావు?" నవ్వుతూ అన్నాడు నరసింహం.

రామారావూ నవ్వి "కావొచ్చు" అన్నాడు.

"తకధీం తకతాహత కిటతక ...."

శబ్దం మధురంగా వినిపిస్తోంది.

"అదిగో దశావతారాలు ప్రాక్టీస్ మొదలుపెట్టినట్టుంది. చూస్తారా?"

రామారావు సంకోచించాడు.

"ఎందుకులెండి."

"పరవాలేదు వాళ్ళేమీ అనుకోరు. విద్య ఒకరు మెచ్చుకొంటే కదా రాణించేది! రండి."

నరసింహం చివరి భాగంలోకి దారితీస్తూ "వెంకటేశ్వర్లుగారూ" అని కేకేసాడు. రామారావు ఆయన్ని అనుసరించాడు. పచ్చటి ఛ్ఛాయతో స్ఫురద్రూపిగా ఉన్న ఓ వ్యక్తి తలుపు తీసి చిరునవ్వు ముఖంతో

సాటి మానవుల కష్టాన్ని ఏ మేరకు తొలగించగలిగినా ఆ మేరకు ఆ వ్యక్తి ఘనవిజయాన్ని సాధించినట్టే (మహాత్ముని సూక్తి)




అన్నాడు.

"తాసిల్దారుగారా, రండి."

"వీరు రామారావుగారని ఆ చివరి భాగంలో ఇవాళే చేరారు."

"నమస్కారం. రండి, కూర్చోండి" ఆయన లోపలకి ఆహ్వానించాడు. రామారావు ప్రతినమస్కారం చేసాడు.

"ఏంలేదు, మన అమ్మాయి నృత్యం చేస్తుంటే చూసి అభిప్రాయం చెప్పమని మీ తరపున నేను వీరిని ఆహ్వానించాను. వీరు బాంక్ ఆఫీసర్. చాలా పెద్దమనిషి. బాగా చదువుకున్నవారు."

"అలాగ, సంతోషం - అమ్మాయ్, ఉదయా!" ఆయన గట్టిగా పిలిచాడు. నృత్యం ఆపి చిరుగజ్జెల రవళిలో ఆమె అల్లనల్లన తలుపు దగ్గరికి చేరి బిడియంగా నిలబడ్డది. వెంకటేశ్వర్లు పరిచయం చేశాడు. వెంటనే ఏదో అనటం మర్యాద అనుకున్నాడు రామారావు.

"సంగీత నృత్యాల్లో మీకింత అభిరుచి ఉన్నందుకు చాలా సంతోషమండీ. ఈ రోజుల్లో అంతా ట్యూషన్ల మీద ట్యూషన్లు ఎగబడి మెడిసిన్ సీటే పరమావధి అనుకొంటున్నారు."

ఆమె ప్రత్యుత్తరంగా చిన్నగా నవ్వింది.

"లలితకళలు ఒక గిఫ్టులెండి" అన్నాడు నరసింహం.

"అదెలా ఉన్నా నేర్చుకుంటున్నదండీ ఇంటిదగ్గర టేప్ ప్లే చేసి స్కూల్లో నేర్చుకున్నదంతా శ్రద్ధగా ప్రాక్టీసుచేస్తూ ఉంటుంది. వర్ణాలు, స్వరజతులు, పదాలు, తిల్లానలు వచ్చాయి. అష్టపదాలు, తరంగాలు నేర్చుకుంటూ ఉంది."

"ఇంకా నేర్చుకొనడం ఏమిటండీ— గొప్ప ప్రావీణ్యం సంపాదిస్తే! అబాలగోపాల తరంగం అభినయిస్తుంటే వెయ్యికళ్ళయినా చాలవు చూట్టానికి. ఏదమ్మా, ఒక్కసారి ఆ అభినయంతో మమ్మల్ని ముగ్ధుల్నిచెయ్యి."

ఆమె నమస్కారంచేసి బంగారు తీగలా కదిలి మెల్లిన తిరిగివెళ్ళి టేప్ రికార్డర్ ఆన్‌చేసింది.

'బాలగోపాలకృష్ణ పాహి పాహి ....'

ఆమె నృత్యంచేస్తుంటే కన్నార్పకుండా చూశాడు రామారావు. నృత్యం చూడటం అతనికి అదేమీ కొత్తకాదు

కాని ఇంతదగ్గరగా ఎప్పుడూ చూడలేదు. ఆ హస్తవిన్యాసాల్లో, భంగిమల్లో ఏదో ఒయ్యారం అతన్ని పరవశింపచేసింది. ఏదో అందం అతన్ని ఉర్రూత లూగించింది. ఏదో భావం అతనిలో నవ చైతన్యం కలిగించింది. ఏదో ఉదాత్తత అతని మనసుని సంస్కరించినట్లయింది. అతని నరనరాల్లో ఏదో స్పందన కలిగింది. అతనికేదో సందేశం అందినట్లయింది.అదేమిటో తెలియటంలేదు. "చాలా బాగుందండీ" అన్నాడు రామారావు.

"థాంక్స్." అందామె మెల్లగా.

"ఏ లోకంలోకిపోయానో ! గొప్పగా ఉందమ్మా. మరి మేం వస్తాం సెలవు."

సెలవు తీసుకొని ఇద్దరూ బయటికి వచ్చారు.

"నిజంగా చాలా బాగుంది. ఏం బాగుందో, ఎందుకు బాగుందో మాత్రం నాకు తెలియదు." అన్నాడు రామారావు ఆలోచనగా.

"ఎందుకేమిటి ? అంతా లయలో ఉంది." అన్నాడు తాసిల్దారు.

"లయా ?"

"అవును. శబ్దంలో లయ, కదలికలో లయ, భంగిమలో లయ.

"లయఉంటే ఎందుకు బాగుండాలి ?"

నరసింహం ఆలోచనలో పడ్డాడు. చప్పున అతనికేదో తట్టింది.

"రామారావుగారూ, నేనింతవరకూ ఆలోచించలేదు. నాకు అకస్మాత్తుగా ఒక ఆలోచన తడుతున్నది."

"ఏమిటది ?"

"గుండె లయప్రకారం కొట్టుకుంటుంది. శబ్దంలోగాని, కదలికలోగాని, భంగమలోగాని మనం లయ గమనిస్తే లయ లయలో కలిసిపోయి మనం తాదాత్మ్యం చెందుతాం. ఏదో అలౌకికమైన ఆనందం కలుగుతుంది. అలా తాదాత్మ్యం, ఆనందం కలిగించేదే అందం. బాగుంది అంటే అందంగా ఉందనే అర్థం. లయ తప్పితే అలాంటి తాదాత్మ్యం కలగదు. బుద్ధి పనిచేస్తుంది. ఆలోచన కలుగుతుంది. అది అలౌకిక ఆనందం ఇవ్వదు. అందుకని అంతా లయతోనే ఉందని నాకు తోస్తోంది."

రామారావు రిటైర్డ్ తాసీల్దారువైపు ఆశ్చర్యంగా కళ్ళుపెద్దవిచేసి చూశాడు. అతని ముఖం చైతన్యంతో కళకళలాడుతోంది.

"మీరు చెప్పింది సమంజసంగానే ఉందని నాకు తోస్తోంది."

"అసలు సృష్టి అంతా రూపంపొందిన లయేకదండీ. మనకి తన్మయాభావం కలుగుతున్నకొద్దీ క్రమంగా సమస్త సృష్టీ అందమైందిగా కనిపిస్తుంది. అంటే అన్నిటిలో మనం లయ గుర్తించగలుగుతాం. ఆ స్థితికి పరాకాష్ఠగా మనం మనలోనే లయ అనుభూతి పొందుతాం, చూడగలుగుతాం, వినగలుగుతాం. అదే ప్రణవం, అదే అద్వైతం అనుకుంటాను."

రామారావు కళ్ళముందు మెరుపు మెరిసినట్లయింది. అనేక టేప్‌రికార్డర్లు, ప్రొజెక్టర్లు ఒకేసారి ఆన్‌చేసినట్లయింది. తచ్చక్షుర్దేవహితం .... తాంగు తకై తళంగు....బాలాగోపాలా .... స్వరాలూ, ముక్తాయింపులూ, ఘల్లు ఘల్లులూ, ఒయ్యారాలూ, విన్యాసాలూ కలిసి కలగాపులగంగా అతన్ని ఉక్కిరిబిక్కిరి చెయ్యసాగాయి. శరీరంలో లోవోల్టేజి విద్యుత్తు ప్రవహిస్తున్నట్టు ఏదో ప్రకంపనం కలుగుతోంది. నరసింహంపట్ల అతనికి అపారమైన గౌరవ భావం కలిగింది. ఆయన చెప్పిందంతా అనుభవవైకవేద్య మనటంలో సందేహంలేదు.

"ఆ స్థితికి అందరూ చేరుకోగలరా ?"

"ప్రయత్నిస్తే ఎందుకు చేరుకోలేరు ?"

"మీరు ఇందాక లలితకళలు ఒక గిఫ్టు అన్నారు."

"లయని అభివ్యక్తం చెయ్యగలగటం గిఫ్టే. అది జన్మజన్మల సంస్కారం. అనగఅనగ రాగమతిశయిల్లు కదా ! లయని గుర్తించటానికికూడా కొంత సంస్కారం కావాలి. అయితే అందరిలోనూ లయ ఉంటుంది కనుక ఆ సంస్కారమూ అంతర్గతంగా ఉంటుంది. పరిసరాల, పరిస్థితుల ప్రభావంవల్ల అది మరుగునపడవచ్చు. ఆ దుమ్ము దులపటమే కళాకారులు చేసేపని."

"అది నిజంగా సాధ్యమా ?"

"కళాకారుడు నిజంగా అనుభూతి పొంది సృష్టించిన కళాఖండానికి ఎదటివ్యక్తి హృదయాంతరాల్ని అయినా కదిలించి పరవశింపచేసే శక్తీ, నైశిత్యమూ, విలాసమూ ఉంటాయి. ఎందుకుండవు ?"

"వ్యక్తిని పరవశింప చెయ్యటమే తప్ప కళకి సామాజిక ప్రయోజనం ఏమీలేదా ?"

"సమత ప్రాతిపదికగా ఏర్పడేదే సమాజం. చివరికి సమతే మానవత.అదే మానవధర్మం. దీనికి భంగం కలిగితే, అది లయతప్పిన సమాజం అవుతుంది. ఈ అనుభూతి పొందించటంద్వారా కళ సమాజానికి కర్తవ్యాన్ని ధన్యాత్మకతో సూచిస్తుంది".

"కళ సమాజాన్ని మార్చగలదంటారా ? కనీసం వ్యక్తినైనా మార్చగలదా ?"

నరసింహం నవ్వాడు.

"మార్చగలదనే నేననుకుంటున్నాను. వ్యక్తి సమాజ జీవి అని సమాజశాస్త్రం అంటోంది కదా. ఒక విధంగా ప్రతి వ్యక్తిలోనూ సమాజం ఉంది. జాతికి సామూహిక ఆవేదన అనేది ఉన్నదనీ, ప్రతి వ్యక్తి అచేతననీ అది ప్రభావితం చేస్తుందనీ మన తత్వశాస్త్రజ్ఞులు అంటున్నారు. ఇది ఒక అంతర్గత అచేతనాత్మక సమైక్యతా శక్తి. అంతరాంత

రాల్లో మానవుడి లక్ష్యం సమైక్యతే. అందువల్ల అతని ఆవేదన సంఘర్షణ కోరదు. సంఘర్షణ చేతనలోగాని, అచేతనలోగాని ఏర్పడినా, ఏర్పడే ప్రమాదం కనిపించినా ఉపచేతన భూతభవిష్యత్ వర్తమానాలకి సంబంధించిన కలల రూపంలో నాటకాలు ప్రదర్శించి హెచ్చరిక చేస్తుంది, లక్ష్యం గుర్తుచేస్తుంది."

"అందువల్ల —"

"అందువల్ల వ్యక్తి ఎప్పుడూ తనతోనూ సమాజంతోనూ సమన్వయం పొందాలనే చూస్తాడు. ఇది అచేతనలో జరుగుతుందా? చేతనలోనా అనేది అతని సంస్కారాన్ని బట్టి ఉంటుంది. అచేతనలో అయితే అది అభివ్యక్తం కావటానికి అతనికి ఉత్తేజం కావాలి. కాళిదాసు శ్లోకం ఒకటుంది – "రమణీయ...." అహా...."

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ
నిశమ్య శబ్దాన్."

"ఆఁ– ఆఁ అదే. మీకు వచ్చన్న మాట. అందమైనవాటిని చూసి, మధురమైన శబ్దాలను విని పర్యుత్సుకుడయే మానవుడు భావాలుగా స్థిరపడ్డ జననాంతర సౌహృదాలని అనుకోకుండానే చేతసనంతో తలుచుకొంటాడట. అంటే ఏమిటి? అతని అచేతన ఉత్తేజితమవుతుంది అందులో నిబిడీకృతమైన సౌహృదాలు గుర్తుకువస్తాయి. సౌహృదాలంటే లయలో లయ కలిగిన ఏవేవో వ్యక్తావ్యక్తమైన జ్ఞాపకాలు అని నా ఉద్దేశం. అదే జననాంతర సంస్కారం. ఎంత గొప్పగా అన్నాడండీ మహాకవి!"

"జననాంతర అంటే, పూర్వ జన్మలో...." నసిగాడు రామారావు.

"పోనీ, తరతరాల సంస్కారం అనుకోండి. అయినా, ఇదేమిటి నాకంతా తెలిసినట్టు ఏమేమిటో ఇష్టంవచ్చినట్టు వాగాను. భలే తెలివిగలవారండీ, మీకేమీ తెలియదన్నట్టు నాకు కీ యిచ్చి నోటికి

స్వంతగొప్ప ఏమీలేనివారు వారి పెద్దలను గురించి చెప్పుకొని గర్విస్తారు. అలాంటివారు భూమిలో బంగాళాదుంపలా అంధకారంలో వుంటారు. (వోవరుబరీ)




వచ్చినట్టు మాట్లాడించేశారే! ఏమండోయ్, నేనూ మీ దగ్గర్నించి సావకాశంగా ఇంతకి ఇంతా రాబట్టగలను. ఏమనుకున్నారో!"

నరసింహం నవ్వుతూ అన్నాడు.

"నేను శ్రోతనేనండీ, నాకు తెలిసిందేమీ లేదు. మీరు కేవలం రెవెన్యూ అధికారంలో తల నెరిసినవారే ననుకున్నాను. చాలా సంగతులు చెప్పారు, థాంక్స్. వస్తా" రామారావు వినమ్రంగా నమస్కారంచేసి సెలవుతీసుకున్నాడు.

ఈ సంఘటన తరవాత రామారావులో కొంత మార్పు కలిగింది. పూర్వపు ఉదాసీనత కొంచెం తగ్గింది. ఉదయ నృత్య విన్యాసాలు తలపుకి వచ్చినప్పుడు ఏదో ఆనందం కలిగేది. దానికి కారణం నరసింహం చెప్పిందో కాదో అతనంతగా విశ్లేషించలేదు. ఆమె నృత్యం చూడాలనిపించినా సభ్యత కాదని ఉపేక్షించాడు. నరసింహంగారే రెండుసార్లు ఆమె సాధనచేసిన కొత్త అంశాలను చూడటానికి రమ్మని పిలిస్తే వెళ్ళి చూశాడు. ప్రశంసించటం తప్ప ఆమెతో మాట్లాడింది కూడా లేదు. ఆమె పట్ల ఏదో అభిమానం మాత్రం ఎక్కువవుతున్నది. "ఆమెలో ఏదో చైతన్యం ఉంది, ఆ చైతన్యంలో ఏదో అందం ఉంది" అనేది అతనికి తోచిన సత్యం. అది మనసులో మెదిలినప్పుడల్లా తనలోనూ ఏదో చైతన్యం కలుగుతున్నట్టు అతను గుర్తించసాగాడు.

స్కూటరుమీద పొద్దున ఏడింటికి సూటిగా బాంక్‌కి వెళ్ళటం, సాయంత్రం అయిదింటికి తిరిగిరావటం, స్నానపానాదులు ముగించుకుని కాలినడకన షికారుగా కాస్తదూరం నడిచిరావటం, రాత్రి పొద్దుపోయేదాకా ఏదైనా చదవటం అతని దైనందిన కార్యక్రమం. అతనికి చెప్పదగిన స్నేహితులంటూ లేరు. వీలైనప్పుడు నరసింహం, వెంకటేశ్వర్లు వచ్చి బాతఖానీవేసి పోతుంటారు.

ఓ రోజు సాయంకాల ఇంటికి వచ్చి రాగానే రామారావు సంచలనాత్మకమైన వార్త విన్నాడు.

"విన్నారా రామారావుగారూ, మన ఉదయ డాన్స్‌స్కూల్లో డాన్స్ నేర్చుకుంటున్న పిల్లని ఎవరో కిడ్‌నాప్ చేసారు." సంభ్రమంతో అన్నాడు

నరసింహం.

రామారావు నిర్ఘాంతపోయాడు.

"ఎవర్ని?" గాభరాగా అన్నాడు.

"లత అనే అమ్మాయి. జగన్నాధం అని అడ్వకేట్ లేడూ, వాళ్ళమ్మాయిట."

రామారావు గుండె కుదుటపడ్డది.

"ఎలా జరిగింది?"

"నిన్న మధ్యాహ్నం స్కూల్‌నించి ఎంత సేపటికీ రాకపోయేసరికి, స్కూల్‌కి వెళ్ళి కనుక్కొంటే పన్నెండింటికే స్కూల్‌నించి వెళ్ళిందన్నారుట. అన్ని చోట్లా వాకబుచేసి చివరికి పోలీస్‌రిపోర్టు ఇచ్చారుట. ఎవడికి పుట్టిందో దుర్బుద్ధి!" నరసింహం వాపోయాడు.

ఇంతలో లోపల్నుంచి వెంకటేశ్వర్లు వచ్చాడు.

"చూసారా, పిదపకాలం పిదప బుద్ధులూ. దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయి. పిల్లని బయటికి పంపాలంటే భయంగా ఉంది. రేపటినించీ స్కూల్ మానెయ్యమన్నాను ఉదయని."

రామారావు మనసు చివుక్కుమంది. ఉదయ తలుపుదగ్గర దీనంగా నిలబడి ఉండటం చూసాడు.

"ఎందుకండీ, ఎంతమంది కాలేజీలకి వెళ్ళి చదువుకోవటంలేదు? అందరికీ ఇలా జరుగుతుందా? ఇదయినా స్కూల్లో జరిగింది కాదుకదా!" అన్నాడు.

"ఆఁ! ఎందుకు రిస్కు?" అతని మాట తోసివేశాడు వెంకటేశ్వర్లు.

ఇంకేమీ అనలేక రామారావు లోపలికి వెళ్ళిపోయాడు.

అయితే ఈ సమస్య త్వరలోనే తేలిపోయింది. ఆ లత అనే అమ్మాయిని ఎవరో ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని ఈ సాహసం చేసాడట. అది తెలిసి ఆ సాయంత్రమే అతన్ని పట్టుకొని ఆ అమ్మాయిని రక్షించటం జరిగింది. నరసింహం, రామారావుల బలవంతం వల్ల వెంకటేశ్వర్లు రెండుమూడు రోజుల తర్వాత మళ్ళీ ఉదయని స్కూల్‌కి పంపటానికి ఒప్పుకొన్నాడు. అప్పటినించీ బెదురు బెదురుగానే ఉదయ స్కూల్‌కి వెళ్ళిరావటం జరుగుతోంది.

ఓ రోజు స్కూటర్ చెడిపోయి బస్‌లో పోవటానికి రామారావు బస్ స్టాప్ చేరుకొన్నాడు. అక్కడ ఉదయ బస్‌కోసం నిరీక్షిస్తూ నిలబడిఉంది. రెండుమూడుసార్లు పలకరించాలని ప్రయత్నించాడు. కాని బాగుండదని ఊరుకున్నాడు. పక్కన ఎవరో గిరజాల యువకుడు తనవైపూ, ఉదయవైపూ చూడటం గమనించాడు. అతనెవరో! ఏం చేస్తుంటాడో! రెండుమూడుసార్లు అతనివైపు చూసాడు. అతను స్థలం మార్చి ఉదయవైపు తదేకంగా చూడసాగాడు. ఉదయ అది గమనించిందా? ఆమె ఊరికే అటూ ఇటూ బెదురు చూపులు చూస్తోంది. అది భయమో, బస్సు లేటవుతున్నదని ఆదుర్దానో! అమ్మయ్య! బస్సు వస్తోంది. ఆమెని పలకరించాలని ఎందుకో బలమైన కోరిక కలిగింది.

"బస్సు వస్తోందండీ!"

ఉదయ ఒక్కసారి తలెత్తి అతనివైపు చూసి ఏమీ మాట్లాడకుండా చప్పున తలతిప్పి, ఓ క్షణం ఆగి ఆ గిరజాల యువకుడివైపు చురుక్కున చూసింది. అతని పెదవులమీద ఓ చిరునవ్వు విరియటం రామారావు గమనించాడు. కాని అతను చప్పున పక్కకి తప్పుకోటంవల్ల ఆమె అతనివైపు కోపంగాచూసిందని రామారావు గ్రహించాడు. ముఖం చిట్లించి అతనివైపు చూసాడు. అదే అతనూ రామారావు వైపు చూసాడు. ఇంతలో బస్సు వచ్చింది. ఉదయ బస్సెక్కింది. ఆ వెంటనే రామారావు కూడా బస్సు ఎక్కాడు. సర్దుకుని బస్సు బయలుదేరబోతుండగా రామారావు బయటికి చూసాడు. ఆ గిరజాల యువకుడు బస్సెక్కలేదు. పైగా నెమ్మదిగా అక్కడి నించి కదిలి వెళ్ళిపోతున్నాడు. రామారావు కింది పెదవి కొరుక్కున్నాడు.

మర్నాడు కూడా అతనక్కడ హాజరయి అదే విధంగా ప్రవర్తించటంతో రామారావుకి అనుమానం బలపడింది. వీడెవడో ఆకతాయి. వీడిని కనిపెట్టి ఉండాలి. లాల్చీ, పైజామా, గిరజాలూ వెధవవేషం, వీడూ! తరవాత రెండు రోజులూ అదే వరస. రామారావుకి ఇంకే సందేహం లేదు. అతనెవరో ఉదయ మీద కన్నువేశాడు. తనేంచెయ్యాలి? స్కూటర్ బాగుపడినా ఆ తరవాతరోజు కూడా అతను బస్‌లోనే పోవటానికి బస్ స్టాప్ చేరాడు. అతనప్పుడే అక్కడ తయారు. ఇంకో అడుగు ముందుకు వేసాడు కూడా. ఉదయ ఏదో పేపరు కొన్నది. "ఒసారి చూసి ఇస్తాను, ఇస్తారా?" అని కాబోలు అతను అడుగుతున్నాడు. ఊచిపుచ్చుకు కొట్టాలనిపించింది. చప్పున అక్కడికి చేరాడు. ఉదయ ఆ గిరజాల యువకుడికి ఏమీ ప్రోత్సాహం ఇవ్వటంలేదని తెలిసిపోయింది. ఆమె అతని ప్రశ్న విననట్టుగా మాట్లాడకుండా ఎటో చూస్తోంది. మంచి పని చేసింది. రామారావుకి సంతోషం వేసింది. ఆ యువకుడిని ఎలా మందలించాలి? నలుగురిలో గొడవచేస్తే ఉదయకే ముప్పు. ఆమెకు తనలాంటి హోదాగల ఉద్యోగి అండగా ఉన్నాడని తెలియచేస్తే. ఈ ఆలోచన రామారావుకి నచ్చింది. తనపేరూ, ఉద్యోగమూ ఉన్న కార్డు అతనికి కనిపించేలా బాగ్‌పట్టుకొని అతనికీ ఉదయకీ మధ్యగా నిలబడ్డాడు. అతను ముఖం చిట్లించుకుంటూ బాగ్ వైపు చూడటం గమనించాడు. ప్రయత్నం ఫలించింది. ఇంక ఆమెతో తనకి ఎంతో పరిచయం ఉన్నట్లు అతనికి తెలియాలి. ఎలా? చొరవగా ఆమెకి

మరింత చేరువగా వెళ్ళి ఏదో పరిచయంగా మాట్లాడుతున్నట్లుగా అన్నాడు.

"ఇవాళ బస్ రాగా లేటవుతుందిట. మీరు రిక్షాలో వెళ్ళండి."

ఆమె అతనివైపు ఓసారి చూసి చప్పున కదిలి రిక్షా మాట్లాడుకుని వెళ్ళిపోయింది. రామారావు గర్వంగా, హెచ్చరికగా ఆ గిరజాల యువకుడి వైపు చూడటానికి వెనక్కి తిరిగాడు. అతనక్కడ లేడు. కొంచెం దూరంగా నిలబడి తనవైపు ముఖం చిట్లించి చూస్తున్నాడు. "రోగం కుదిరిందిలే" అనుకుని రామారావు బస్సు రాగానే ఎక్కి వెళ్ళిపోయాడు.

మర్నాడు అతను బస్‌స్టాప్‌లో ఆ యువకుడి కోసం గాలించిచూశాడు. కనుచూపుమేర దూరంలో ఎక్కడా లేడు. రామారావు విజయగర్వంతో బస్సెక్కి వెళ్ళిపోయాడు. మర్నాడు స్కూటర్ మీద ఆఫీసుకు వెడుతూ బస్‌స్టాప్‌లో చూశాడు. ఉదయ నిలబడి ఉంది. ఆ యువకుడు లేడు. ఉత్సాహంగా ఈలవేసి ముందుకు సాగిపోయాడు. అయితే ఆ ఉత్సాహం మర్నాడు హరించింది. మాసినగడ్డంతో అతనక్కడ మళ్ళీ ప్రత్యక్షం. ప్రేమికుడి విరహవేషం కాబోలు. రామారావుకి ఏంచేయాలో తోచలేదు. స్కూటర్ రోడ్డు పక్కన ఆపి అలాగే కూర్చుండిపోయాడు. రాస్కెల్. ఓ చోట నిలబడడు. ఏదో పని ఉన్నట్టు, ఉబుసుపోకకో అన్నట్టు, ఆవైపు కాసేపు ఈవైపు కాసేపు, ముందుగా నిలబడి కాసేపు చూపులు విసురుతాడు. ఇంక ఉపేక్షించరాదు. పోలీస్ రిపోర్ట్ ఇస్తే! కాని తొందర మంచిది కాదు. ఓనిశ్చయానికి వచ్చి రామారావు స్కూటర్ సరిగ్గా ఆమె దగ్గర ఆపాడు.

"రండి డ్రాప్‌చేస్తాను. బస్ అప్పుడే వచ్చేట్టు లేదు".

ఆమె కొంచెం విస్మయంతో చూసింది.

తెలిసిన మూర్ఖుడు తెలియని చవటకన్నా పెద్ద చవట. (మోలియర్)




"రిక్షాలో వెళతాలెండి." చప్పున ఆమె అక్కడినుంచి కదిలి రిక్షాలో వెళ్ళిపోయింది. ఆమాట తనే అని ఉండవలసింది. కాని అతని ఎదట తనదారిన పోతాడేమో, బెడద వదిలిపోతుందని ఆశపడ్డాడు. ఉదయ ఏమైనా అనుకుందేమో! రామారావు అప్రయత్నంగా అతనివైపు చూసాడు. అతను తనవైపు చీదరించుకుంటున్నట్టు చూస్తున్నాడు. అవును, మరి! పానకంలో పుడకలాగా అడ్డుతగిలాడు కదా తను! వీడూ, వీడి వాలకమూ, ఒట్టి రోడ్డు రోమియో! రాస్కెల్. రామారావుకి అకస్మాత్తుగా ఇంకో అనుమానం వేసింది. తను పొద్దునే బస్‌స్టాప్‌లో ఇతను నిఘావేయటం గమనిస్తున్నాడు. ఉదయ తిరిగి ఇంటికివెళ్ళేటప్పుడు కూడా ఇలాగే వెంబడిస్తున్నాడేమో! ఆ విషయం తెలుసుకోవాలని రామారావు ఆ రోజు శనివారం కావటం వల్ల పన్నెండింటికి బాంక్ వదిలి స్కూటర్ మీద హుటాహుటిగా బయల్దేరాడు. బస్‌స్టాప్ నుంచి ఇంటికి నడిచివెడుతూ అల్లంత దూరాన ఉదయ కనిపించింది. ఆమె వెనకే స్కూటర్ నెమ్మదిగా పోనిస్తున్నాడు. మలుపు తిరిగింది. అదుగో, రాస్కెల్! ఆ గిరజాల యువకుడు కిళ్లీ కొట్టుదగ్గిర! అతనివైపు అసహ్యంగా చూసాడు. అతనుకూడా రామారావుని చూసి ముఖం చిట్లించుకున్నాడు. రామారావు అలాగే ఇంటిదాకా ఆమె వెనకే వెళ్ళసాగాడు. ఇహ ఇతన్ని ఉపేక్ష చెయ్యకూడదు!

ఆ తరవాత రోజున ఓ వింత సంఘటన జరిగింది. మధ్యాహ్నం భోంచేసి బాంక్ సాంస్కృతిక నాటకోత్సవాలకి మేకప్‌మాన్‌ను కుదుర్చుకోటానికి వెళ్లాడు రామారావు. అతనితో మాట్లాడి వెళ్ళబోతున్న సమయంలో రౌడీలాఉన్న ఓ వ్యక్తి లోపలికిరాబోతూ అతనివైపు తీక్షణంగా చూసాడు. రామారావుకి అతన్ని ఎక్కడో చూసినట్టనిపించింది. చూస్తే అది వేషంలా ఉంది. ఎవరో తెలిసినవ్యక్తే. గుర్తు రావటం లేదు. ఆలోచన మానేసి ఇంటికి బయలుదేరాడు. ఇంటికిరాగానే వెంకటేశ్వర్లు, వరసింహం లబోదిబోమన్నారు. మధ్యాహ్నం అంతా ఎవరి పనిలో వాళ్ళున్నారట. ఉదయ నృత్యం ప్రాక్టీసుచేసుకుంటోందిట. ఆ సమయంలో ఎవరో ఉదయని కిడ్నాప్ చెయ్యటానికి ప్రయ

గాయాన్ని చాలా తేలికగా మరచిపోవచ్చు. కాని అవమానాన్ని మాత్రంకాదు.

(లార్డ్ చెస్టర్‌ఫీల్డ్)




త్నించి, ఆమె బెంబేలెత్తి అరిస్తే పారిపోయాట్ట. చూట్టానికి రౌడీలా ఉన్నాట్ట!

"ఏమిటి బాబూ ఈ ఉపద్రవం?" వెంకటేశ్వర్లు గోలపెట్టాడు.

రామారావు ముఖం జేవురించింది. రౌడీ! వాడే! ఇందాక తను చూసినవాడే అయిఉంటాడు.

చప్పున మేకప్‌మేన్ దగ్గరికి పరిగెత్తాడు.

"అతనెవరో తెలీదండీ. డబ్బు డిపాజిట్ చేసి డ్రెస్ తీసుకెళ్ళి మళ్ళీ వాపసుచేసి పోయాడు. పేరేదో చెప్పాడు గాని గుర్తులేదు." అన్నాడు మేకప్ మాన్. నిస్పృహతో రామారావు వెనక్కి తిరిగివచ్చాడు. గిరజాల యువకుడి మీద అనుమానం కలిగింది గాని ఆ వెర్రి ప్రేమికుడు ఇలాంటి పని చెయ్యడని విశ్వయించుకున్నాడు. అందువల్ల ఆ విషయం ఎవరికీ చెప్పలేదు. వెంకటేశ్వర్లు పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడు.

తరువాత వారంరోజులకి రామారావు బాంక్‌లో పనిచేసుకుంటూ ఉండగా అతనికి ఫోన్‌కాల్ వచ్చింది. ఒకసారి స్టేషన్‌కి అర్జంటుగా వచ్చి వెళ్ళవలసిందని పోలీస్ సబిన్‌స్పెక్టర్ ఫోన్ చేశాడు. అతను తనకి తెలిసినవాడే. ఉదయ విషయం ఏదో తెలిసిఉంటుంది. హుటాహుటిన వెళ్ళాడు రామారావు.

"ఏమిటి విశేషం ఇన్‌స్పెక్టరుగారూ? అర్జంటుగా పిలిచారు."

"ఏమనుకోవద్దు! మీమీద ఓ కంప్లెయింట్ వచ్చింది."

"కంప్లెయింట్!" ఆశ్చర్యంగా అడిగాడు రామారావు.

"అవును. ఉదయ అనే అమ్మాయిని మీరు వేధిస్తున్నారట. ఆమెని కిడ్‌నాప్ చెయ్యటానికి ప్రయత్నిస్తున్నారట."

రామారావు నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది.

"ఏమిటీ! నేను ఉదయని వేధిస్తున్నానా? కిడ్‌నాప్ చెయ్యటానికి ప్రయత్నిస్తున్నానా! ఇంతకంటె ఘోరమైన అపవాదు ఉంటుందా? ఆ మాట ఉదయని గాని, వాళ్ళ నాన్న వెంకటేశ్వర్లు గారిని గాని. మా రెండు భాగాల యజమాని నరసింహంగారిని గాని అనమనండి."

"నాకు తెలుసు. నేనూ ఈ కంప్లెయింట్ చూసి ఆశ్చర్యపోయాను. విషయం మీకు చెబుదామని పిలిచాను అంతే."

"ఇంతకీ ఎవరా కంప్లెయింట్ ఇచ్చింది"

"ఎవరో శ్యామ్‌సుందర్ అట. అడ్రస్ కూడా ఇచ్చాడు. మీరే చూడండి కంప్లెయింట్."

రామారావు కంప్లెయింట్ చదివాడు. అతనికి తలా తోకా తెలియటంలేదు. అడ్రస్ నోట్‌చేసుకున్నాడు.

"అతను ఇచ్చే సాక్ష్యం ఏమిటో విచారించండి ఇన్‌స్పెక్టర్‌గారూ."

"తప్పకుండా.తప్పుడు కంప్లెయింట్ ఇస్తే ఫలితం అతనే అనుభవిస్తాడు."

రామారావు ఇన్‌స్పెక్టర్ దగ్గర సెలవు తీసుకుని క్రోధఘూర్ణితుడై మహావేగంగా శ్యామసుందర్ అనే అతని ఇంటికి చేరుకుని బడబడ తలుపులు బాదాడు. తలుపులు తెరుచుకున్నాయి. రామారావుకి నోట మాట రాలేదు. ఎదురుగా ఆ గిరజాల యువకుడు నుంచుని ఉన్నాడు.

"రండి, కూర్చోండి" అన్నాడతను పొడిగా.

"మీరేనా శ్యామసుందర్?" కటువుగా అడిగాడు రామారావు.

"అవును."

"మీరు నాపై పోలీస్‌కి ఇచ్చిన కంప్లెయింట్ రుజువుచేసుకోండి. లేకపోతే బేషరతుగా క్షమాపణ కోరుకోండి తక్షణం"

"మీ చర్యలు నేను గమనించటం మీకూ తెలుసుగా."

"నా చర్యలా? సిగ్గులేదూ? ఉదయ వెంట రోడ్‌రోమియోలా తిరుగుతూ వెకిలిపనులు చేసింది చాలక నాపై అభాండమా! బాగుంది. అప్పుడే నలుగురిలోనూ చెప్పుతీసుకు కొట్టాలిసింది. విడిచిపెట్టి పొరపాటు చేసాను."

"అవి నేను అనాలిసిన మాటలు.

స్టాప్‌లో, బస్సులో, స్కూటర్ పైనా ఆమె వెంటపడ్డది మీరా, నేనా?"

"షటప్. ఉదయ కుటుంబం, నేనూ పక్క భాగాల్లోనే ఉంటాం. వేషాలు వెయ్యదలుచుకుంటే ఇంట్లోనే వెయ్యొచ్చు. రోడ్డెందుకు?"

"ఇంట్లో పెద్దమనుషులైతే రోడ్డు మీద కూడా పెద్దమనుషులు కావాలా?"

"మీది వక్రబుద్ధి. మీ బారినించి ఆమెని రక్షించటానికే నేను ఆ విధంగా ప్రవర్తించాను."

"మీరామెని ప్రేమిస్తున్నారా?" అతనొకక్షణం ఆలోచించి అన్నాడు.

"లేదు. ఆమె కళని ప్రేమిస్తున్నాను."

శ్యామసుందర్ నవ్వాడు.

"కళని కళాకారిణినించి ఎలా వేరు చేస్తారు? ఆమె కళ మీకు ఆనందమిచ్చి ఉంటుంది. అది సొంతం చేసుకోవాలనుకున్నారు. మీరామెని ప్రేమించలేదు. ఆమె కళని ప్రేమించలేదు. కాని ఆమె మీకు కావాలి."

"ఛీ. అది నీచమైన అపవాదు వెయ్యటంతప్ప మరేంకాదు."

"ఆమెనే కాదు. మీరు ఎవర్నీ ప్రేమించలేదు. ప్రేమించేవాళ్ళని చూస్తే గుర్తించవచ్చు. ఎందుకంటే ప్రేమ దివ్యమైంది. ఆ కళే వేరు."


"మీరామెని ప్రేమించారా?" కసిగా అన్నాడు రామారావు.

"ప్రేమించాననుకున్నాను. బహుశా మీలాగే ఆమె నృత్యాన్ని చూసి ఆనందించి ఉంటాను. అదే ప్రేమ అనుకొని నానా అవస్థలూపడి ఆమె ముఖలక్షణాలు స్టడీచేసి ఆమె బొమ్మను గీసాను."

రామారావు ఆశ్చర్యంగా అతనివైపు చూసాడు.

"మీరు చిత్రకారులా?"

"అవును. ఆమె వదనం చిత్రిస్తుంటే నేనామెని ప్రేమించలేదని, ప్రేమించలేనని తెలుసుకొన్నాను."



"ఎందువల్ల?" కుతూహలం కలిగింది రామారావుకి.

"ఆమె వదనంలో ఏదో దివ్యత్వముంది. నాలో లేనిది. అందువల్ల."

"ఆ బొమ్మ నేను చూడొచ్చా."

"తప్పక."

శ్యామ్‌సుందర్ అతనిని లోపలికి తీసుకువెళ్ళి స్టాండ్‌మీద చిత్రం అమర్చాడు. రామారావు చిత్రం చూసి ముగ్ధుడయ్యాడు, పరవశించాడు. ఆ వదనంలో కర్షణ ఉంది. ఏదో అనిర్వచనీయమైన ఉదయని చూసినప్పుడే అతనికి అది తోచింది. అదేమిటో శ్యామసుందర్ బాగా గ్రహించి అభివ్యక్తం చేసాడు. ఆ క్షణంలో అతనిపట్ల కొంచెం గౌరవం కలిగింది.

"మీరనే దివ్యత్వాన్ని నేను గ్రేస్ అంటాను. బాగానే కాప్చర్ చేసారు."

"థాంక్స్. కాని అది గ్రేస్ కాదు" ఆ కళ్ళలో దీక్షగా చూడండి. ఆ దివ్యత్వంవల్లే ఆమె గొప్ప ఆర్టిస్ట్ అవుతుంది. మనలో దివ్యత్వాన్ని ప్రేరేపించగలుగుతుంది. అయితే మనం క్షణంలో ఆ దివ్యత్వాన్ని మహా భీరుత్వంగా మార్చివెయ్యగలం. అప్పుడా దివ్యమైన నేత్రాలు మనలో మహా కరుణని ప్రేరేపించగలుగుతాయి" తాపీగా అన్నాడు శ్యామసుందర్.

రామారావుకి అర్థంకాలేదు. తికమకగా అన్నాడు.

"ఆర్టిస్టుకి సాధ్యంకాని దేముంది?"

"ఇలలో లేనిది ఆర్టిస్ట్ ఎలా తలపింపచేస్తాడు? ఆ అవసరం మాత్రం ఏముంది?"

"నిజమే. మోడల్ ఉండాలనుకోండి. అలాంటి చిత్రంకూడా వేసేఉంటారు. చూడొచ్చా?"

"తప్పక. లోపల ఉంది. మీరీచిత్రం

కిడ్‌నాప్ చెయ్యనంటే తెస్తాను."

రామారావు ముఖం కందగడ్డయింది. వచ్చినపని మర్చిపోయి మర్యాదగా సంభాషిస్తున్నందుకు మంచి శాస్తిచేసాడు! కళ్ళెఱ్ఱచేసి అతని కళ్ళలోకి తీక్ష్ణంగా చూసాడు. అతనికి చప్పున తట్టింది. ఆ రోజున మేకప్‌మాన్‌దగ్గిర చూసిన రౌడీ కళ్ళు ఇవే! వికటంగా నవ్వాడు రామారావు.

"కిడ్‌నాప్! మిస్టర్ శ్యామసుందర్! ఉదయని కిడ్‌నాప్ చెయ్యటానికి వేషం వేసిన రౌడీ! దుర్మార్గుడా! నువ్వు నేరం చేసి ఇతర్ల మీదికి తోస్తావా! నువ్వు అర్టిస్టువా!" రామారావు అతనిమీద కలియబడబోయాడు. అతను రామారావుని "ప్లీజ్" అంటూ శాంతపరిచి కూర్చోపెట్టాడు.

''తక్షణం అపాలజీ ఇవ్వు. లేకపోతే నీ అంతు తేలుస్తా."

"ఆవేశపడకండి రామారావుగారూ, నేను బొమ్మకోసం తెగించి నాటకం ఆడాను. మీరు ఉదయని నిజంగా కిడ్‌నాప్ చేస్తారని నేననుకొన్నాను. అందుకే కంప్లెయింట్ ఇచ్చాను. నా ఊహ తప్పయితే నన్ను క్షమించండి. కాని ముందు బొమ్మ చూడండి."

శ్యామసుందర్ లోపలికివెళ్ళి ఆయిల్ కలర్స్‌తో చిత్రించిన ఓ చిత్రం తెచ్చి స్టాండ్‌మీద వేసాడు.

"ఉదయ!" రామారావు ముఖం పాలిపోయింది.

"దగ్గిరికి వచ్చి చూడండి." శ్యామసుందర్ అన్నాడు.

రామారావు దగ్గిరగావచ్చి ఆ చిత్రం ముందు నిలబడి చూడసాగాడు. ఆ నల్లటి సోగకళ్ళు అయోమయంగా, బెదురుగా, ఆందోళనగా, దీనంగా, భయంగా అతనివైపు చూస్తున్నాయి. ఆ వదనం కుచించుకుని, ముడుచుకుపోతున్నట్లయి వెలవెలపోతున్నది. ఏదో వేడుకోవాలని సగం తెరిచిన నోరు ఆరాటపడుతున్నది. శిరోజాలన్నీ ఎక్కడికో పారిపోవాలని దారులు వెతుకుతున్నాయి.

అదేమిటి! ఇప్పటిదాకా లేదే! ఆ కన్నీటితెర గిర్రున తిరుగుతోందేమిటి? ఇది బొమ్మకాదా? "అమ్మో" అని వెర్రికేక వినిపించినట్లయి అతని నవనాడులూ కుంగిపోయాయి. "ఉదయా" అని అరిచాడు రామారావు. "నెవర్, నెవర్ ఉదయా, నెవర్".

"తేరుకోండి రామారావుగారూ, అది బొమ్మే." శ్యామసుందర్ అతని భుజం తట్టాడు.

"ఉదయకి ఇంత బాధ కలిగించావా, దుర్మార్గుడా." అంటూ రామారావు శ్యామసుందర్‌ని చాచి చెంపమీదకొట్టి చప్పున బయటికివచ్చి వేగంగా స్కూటర్ ఇంటివైపుకి నడిపించాడు. అతనికి తక్షణం ఉదయని చూడాలనిపించసాగింది. వేగం పెంచాడు.

ఇల్లుచేరగానే అతని గుండె కుదుటపడ్డది. ఎంతమాటన్నాడు రాస్కెల్. తను ఉదయని కిడ్‌నాప్ చేస్తాడా! నెవర్, నెవర్ నెవర్ టు ది పవర్ ఆఫ్ ఎన్.

లోపలికి అడుగుపెట్టగానే మధ్యభాగంలోంచి నరసింహం స్వరం వినిపించింది. "తచ్చక్షుః ర్దేవహితం పురస్తాచ్ఛుక్రముచ్చరత్ పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం.... "

చివరి భాగంలోంచి నృత్యసంగీతం వినిపించింది.

" తకిట తకిట తకిట తకిట తధిగిణతోం ".

ఉదయని చూడాలనుకున్న సంగతి మర్చిపోయాడు రామారావు. అతనికి అకస్మాత్‌గా నూరుశరత్తులు బ్రతకాలనిపించింది. నూరుశరత్తులు అందమైనవి చూడాలి. నూరుశరత్తులు మధురమైనవి వినాలి!

